క్లుప్తంగా

డీజీపీని కలిసిన ఉదయభాను



చిల్లకల్లు(జగ్గయ్యపేట): రాష్ట్ర డీజీపీ కె.వి. రాజేంద్రనాథ్‌రెడ్డిని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మర్యాద పూర్వకంగా కలిశారు. రామ్‌కో సిమెంట్ కర్మాగారంలోని గెస్టుహౌస్‌లో విజయవాడ పోలీస్ కమీషనరేట్ పరిధిలో నేర సమీక్షపై బుధవారం రాత్రి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని విప్ ఉదయ భాను మర్యాద పూర్వకంగా కలిశారు. జ్ఞాపికను అందజేశారు.

నేడు షాదీఖానాకు శంకుస్థాపన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ముస్లింల చిరకాలవాంఛ అయిన షాదీఖానా నిర్మాణానికి గురువారం సాయంత్రం నాలుగు గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను బుధవారం తెలిపారు. స్థానిక హైదరాబాద్ రోడ్‌లోని పులిచింతల కార్యాలయం పక్కన రూ.75లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేస్తారని వివరించారు. కార్యక్రమానికి రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌసులా ఆజం, ఎమ్మెల్సీ రుహుల్లా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ హాజరుకానున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ముస్లింలంతా పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పనుల పరిశీలన



పెనుగంచిప్రోలు: గ్రామంలో తూర్పు బజారులోని కెవిల్ పాఠశాల నూతన భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి వారికి అవసరమైన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయడంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ డైరక్టర్ బత్తుల రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వూట్ల నాగేశ్వరరావు, జంగాల శ్రీనివాసరావు, బెజవాడ శ్రీనివాసరావు, తమ్మిశెట్టి సోమయ్య, దేరంగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార సభాస్థలం పరిశీలన



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ నూతన పాలక వర్గం ఈనెల 17న ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈనేపథ్యంలో బుధవారం ఆలయం వద్ద సభా వేదిక స్థలాన్ని ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, నూతనంగా ప్రమాణస్వీకారం చేయబోయే పాలక వర్గ సభ్యులు జంగాల శ్రీనివాసరావు, బెజవాడ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం అనంతరం సభ, మునేరు అవతల మామిడి తోటల్లో భోజనాలు ఏర్పాట్లు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలోమైనింగ్ కార్పొరేషన్ డైరక్టర్ బత్తుల రామారావు, ఏఎంసీ డైరక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, బీసీ నాయకులు అంగజాల కాశీరాజ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వికసిత్ భారత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్ సమీపంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాప్టిస్టుపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేఘనందిత, ఇతర ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కీసర వాసులకు రూ.43.60కోట్ల లబ్ధి



కీసరలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు

కీసర(కంచికచర్ల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో కీసర గ్రామసచివాలయ పరిధిలోని ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.43.60కోట్లు అందాయని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. కంచికచర్ల మండలం కీసర గ్రామ సచివాలయం వద్ద బుధవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పథకాల లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పేదలకు ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దన్నారు. సీఎం జగన్ అవినీతి రహిత పాలన కొనసాగిస్తూ అందరికీ సంక్షేమఫలాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. నందిగామ నియోజకవర్గాన్ని తాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తనను ఎమ్మెల్యేగా రెండోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచి పేరం నర్సమ్మ, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, పరిటాల రాము, వేల్పుల రమేష్, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ బాలశంకరరావు, కార్యదర్శి యండ్రప్రగడ సుబ్రమ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్లింలను అక్కున చేర్చుకున్న జగనన్న..

నందిగామ టౌన్: ముస్లిం మైనార్టీలను అక్కున చేర్చుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని మూడోవార్డులో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన సంక్షేమ క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో ముస్లిం మైనార్టీలకు చోటు కల్పించడంతోపాటు ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టారన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించగా, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి అంతకుమించి చేస్తున్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మూడోవార్డులో గతంలో చూడనంత అభివృద్ధిని చేసి చూపించామని రానున్న రోజుల్లో వార్డును మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికలలో సైతం అండగా ఉండి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ ఖాలిక్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ చౌంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ జాఫర్, మున్సిపల్ కమీషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, పలువురు నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కె.అగ్రహారం డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మండవ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు



నందిగామలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట మండలంలో...

కే.అగ్రహారం(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని మండల పార్టీ కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలో కె.అగ్రహారం సచివాలయం వద్ద బుధవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పథకాల లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామ పార్టీ కన్వీనర్ పసుపులేటి శ్రీనివాసరావు, సర్పంచ్ ఆవుల శ్రీనివాసరావు మండల సచివాలయాల కన్వీనర్ సయ్యద్ షాబుద్దీన్, పార్టీ నాయకులు వీరబాబు, ఆదిమల్ల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కవిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

ప్రభుత్వ విప్ ఉదయభాను



అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటున్న విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన ధర్నా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అంగన్‌వాడీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అంగన్‌వాడీలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, సిఐటియు నాయకులు, అంగన్‌వాడీల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా

ఎమ్మెల్సీ అరుణకుమార్



భవానీ శంకరుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్

నందిగామ టౌన్: భవానీ శంకర ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ కుమార్ హామీ ఇచ్చారు. మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న భవానీ శంకర ఆలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా గౌరీ పాడ్యమిని పురస్కరించుకుని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. భవానీ శంకరుడి ఆలయ అభివృద్ధికి రూ.1.16లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ గౌరీ పాడ్యమి సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సహకారంతో రూ.1.16లక్షల విరాళం అందించానని చెప్పారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని చెప్పారు. రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పగడాల రామారావు, రామిశెట్టి పూర్ణ, జనార్ధన్, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా బ్రహ్మేశ్వరరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, వేల్పుల రమేష్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.20వేలు సాయం

నందిగామ టౌన్: బాధితులకు ఎల్లవేళలా అండగా ఉంటానని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పట్టణంలోని ఏడోవార్డులో ఇనపనూరి జయరాజు నివాసంలో సామగ్రి దగ్ధం కావడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకుని, బాధిత కుటుంబానికి రూ.20వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సామగ్రి దగ్ధకావడం బాధకరమన్నారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ రాజశేఖర్, మాడుగుల మనోహర్, పాకాలపాటి కిరణ్, చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న పీడీ పద్మావతి, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను ఆసక్తి పెంపొందించుకోవాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న బాలికల అంతర పాలిటెక్నిక్ జోనల్ స్థాయి ఆటల పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే మానసికోల్లాసం కలుగుతుందని అంతే కాకుండా భవిష్యత్తులో ఉద్యోగావకాశాలలో కూడా క్రీడాకారులకు తగిన ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. విద్యార్థులకు చదువు ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకే పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో పలు విభాగాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ప్రత్యేక చర్యలు తీసుకుని ఈనెల 15వతేదీ నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీల నిర్వహణ తలపెట్టినట్టు చెప్పారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పీడీ వి.నాగేశ్వరరావు, విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల పీడీ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ జాఫర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా నిర్వహణపై సమీక్ష



నందిగామ: ప్రభుత్వం ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. నందిగామ పట్టణ పరిధిలో ఈనెల 15ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై పలు శాఖల సిబ్బందితో బుధవారం ఆయన తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అన్ని రకాల క్రీడాసామగ్రిని ప్రభుత్వమే అందజేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో గేమ్స్ కన్వీనర్ శ్రీనివాసరావు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజను కొంటాం




కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు(కంచికచర్ల): రైతు అరుగాలం కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. వీరులపాడు మండలం జయంతి గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారుల చేతిలో మోసపోవద్దని రైతులకు సూచించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,203, సాధారణ(కామన్)రకం ధాన్యానికి రూ.2,183లను ప్రభుత్వం మద్దతు ధరగా ప్రకటించిందని తెలిపారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సౌజన్య, సొసైటీ అధ్యక్షుడు జంగా కోటిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆవల రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, మారపాక శ్రీనివాసరావు, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



పల్లగిరి గుట్టపై ఆలయం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



పెనుగంచిప్రోలు మునేరులో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



మున్నేటి తీరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సామూహిక కుంకుమ పూజలుచేస్తున్న మహిళలు



లోకకల్యాణార్థం హోమం చేస్తున్న అర్చకులు

నందిగామ: కార్తికమాసం ముగింపు, గౌరి పాడ్యమి నేపథ్యంలో బుధవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నందిగామ నియోజకవర్గంలోని అన్ని శివాలయాల్లో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. గౌరీ పాడ్యమి సందర్భంగా కార్తిక దామోదరుడికి భక్తులు ఘన వీడ్కోలు పలికారు. వేకువజామునే ఆయా ఆలయాలు, మున్నేటి వద్ద మహిళలు పరమశివుడికి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అరటిదొప్పల్లో దీపాలను వెలిగించి మున్నేటిలో వదిలారు. నీటిలో దీపాలు వదిలేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణ శివారుల్లోని మున్నేటి తీరం సందడిగా మారింది. నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు జరిగాయి. తెల్లవారు జాము మూడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. పల్లగిరి గుట్టపై గల భవాని శంకరస్వామి వారి వాయులింగం వద్ద భక్తులు వేకువజాము నుంచే అభిషేకాలు, అన్నాభిషేకం చేశారు. దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. వైరా, కట్టలేరు సంగమ ప్రాంతంలో భక్తులు పుణ్యస్నానమాచరించి కార్తిక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

కళకళలాడిన మున్నేటి తీరం ..

పట్టణ శివారుల్లోని మున్నేటి తీరం కార్తికదీపాలతో కాంతులీనింది. తెల్లవారు జాము మూడు నుంచి ఐదుగంటలలోపు పోలి దీపాలు వెలిగించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో మున్నేటి తీరం కోలాహలంగా మారింది.

కిక్కిరిసిన శివాలయాలు..

పెనుగంచిప్రోలు: కార్తీక మాసం ముగింపు గౌరీ పాడ్యమి సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. శంభో శంకర... శంభో అంటూ ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీస్వయంభు శంభులింగేశ్వర స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు, అభిషేకాలు జరిపించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించడంతోపాటు మునేరులో అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి నీటిలో వదిలారు.



మున్నేటిలో పోలి దీపాలు వదులుతున్న భక్తురాలు

ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన హర్షసాయి

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఎంపీడీవో ఎం.హర్షసాయి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనేందుకు మండలంలో మొత్తం 2194 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, చూసేందుకు ప్రేక్షకులు 3,392 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. క్రీడలు నిర్వహించేందుకు పెనుగంచిప్రోలులోని కెవీఆర్ జెడ్పీ(బాలుర) హైస్కూల్, జెడ్పీ(బాలికల) హైస్కూల్, శ్రీచైతన్య హైస్కూల్, కొణకంచి జెడ్పీ హైస్కూల్, కొల్లికుళ్ల జెడ్పీ హైస్కూల్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. క్రీడల నిర్వహణ ప్రత్యేకంగా వ్యాయామోపాధ్యాయులు నియమించామని, డిసెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీల్లో క్రీడాకారులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గ్రామ సచివాలయ పరిధిలో డిసెంబర్ 15 నుంచి 20 వరకు, మండలస్థాయిలో డిసెంబర్ 21 నుంచి వచ్చే ఏడాది జనవరి 4వతేదీ వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. ఏఓ సిద్ధారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

వీరులపాడు(కంచికచర్ల) : మండలంలోని జయంతి గ్రామంలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాలకు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో సీసీరోడ్లను నిర్మించాలని గ్రామస్తులను చేసిన విజ్ఞప్తి మేరకు రూ.20లక్షలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే వివరించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సర్పంచి మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ ఇప్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సౌజన్య పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధన

నందిగామ: మండలంలోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల వన సమారాధన కార్యక్రమం బుధవారం సందడిగా జరిగింది. విద్యార్థులు సరదాగా ఆటలాడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

అమర గాయకుల సేవలు ఆదర్శనీయం



గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: అమర గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు సయ్యద్ ఆలీ అన్నారు. ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై బుధవారం అమర గాయకుడు కిషోర్‌కుమార్, మహ్మద్ రఫీ, మన్నాడే, లతా మంగేష్కర్, ఘంటసాల తదితర గాయనీ గాయకుల స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. సయ్యద్ ఆలీ మాట్లాడుతూ హిందీ చిత్రగీతాలకు జాతీయ స్థాయి గుర్తింపును తీసుకువచ్చారని తెలిపారు. కళా పోషకుడు మీరాకుమార్, కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. డి.చంద్రశేఖర్, మల్లాది స్వాతి, రూపాశ్రీ, రాంబాబు తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. సయ్యద్‌ఆలీ, గాయకుడు రాంబాబును నిర్వాహకులు సత్కరించారు.

క్రీడా పోటీలకు ఏర్పాట్లు

కంచికచర్ల : ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ కోరారు. గండేపల్లిలో ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణ కోసం పాఠశాల ఆవరణను బుధవారం చదును చేశారు. సర్పంచి మాట్లాడుతూ క్రీడాకారులు, ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులంతా పాల్గొనాలని కోరారు.